# ప్రేమించే మనసుంటే...

**-పులగం చిన్నారాయణ**

శ్రీజ ప్రేమకథ తెలియగానే ఇరవై ఏళ్ళ క్రిందటి నా గతం కళ్ళ ముందు మెదలాడింది.

ఎంత అణచుకున్నా ఉవ్వెత్తున ప్రేమభావనలు నన్ను ముంచెత్తాయి.

నాకప్పుడు ఇరవయ్యేళ్ళు. డిగ్రీ చదువుతున్నాను. ఓ పాటలా..., ఓ పరిమళంలా.. ఓ దృశ్యంలా...'స్వరూప్' నా గుండెల్లోకి దూసుకుపోయాడు.

నా సామీప్యం కోసం, సాన్నిహిత్యం కోసం, చల్లనిమాట కోసం, చిరునవ్వు కోసం, స్పర్శకోసం, పరామర్శకోసం, పరితపించి పోయేవాడు.

ఎప్పుడూ ఏదో ఒకటి అంటూ నన్ను అల్లరి పెట్టేవాడు. నేను కోపగించుకుంటుంటే అమాయకంగా ముఖం పెట్టి క్షమించమని అడిగి నన్ను క్షణంలో చల్లార్చేసేవాడు.

మా ప్రేమ అప్పుడే పెద్దలకు తెలియకూడదనే ఉద్దేశ్యంతో ఎప్పుడూ ఏకాంతంగా కలిసే వాళ్ళం కాదు. మా ప్రేమంతా ఉత్తరాల ద్వారానే నడిచింది.

మా ఆనందాన్ని చూసి కాలానికి కన్ను కుట్టినట్లుంది. స్వరూప్ వ్రాసిన లెటర్లు ఒకరోజు మా నాన్నగారి కంటపడ్డాయి.

అంతే....

ఆకాశంలో రెక్కలు సాచి హాయిగా విహరిస్తున్న నేను ఒక్కసారిగా పంజరంలో పక్షిలా బందీనైపోయాను. కానీ మా ప్రేమను, ఏ శక్తీ అడ్డుకోలేకపోయింది.

కొన్నాళ్ళు విరహవేదన అనుభవించాం. ఆ సమయంలో తన సంగతి ఎలా వున్నా నేను మాత్రం పిచ్చిదాన్నే అయిపోయాను. ఎప్పుడూ ఏవో ఆలోచనలు. ఆ ఆలోచనల నిండా 'స్వరూప్'.

ఇంట్లో వాళ్ళందరికీ దూరంగా వుండటం ప్రారంభించాను. అవసరముంటేనే మాట్లాడటం. అదీ ముక్తసరిగానే.

స్నేహితురాళ్ళతో సరదాగా వుండటమే మర్చిపోయాను. ప్రతీదానికి విపరీతంగా కంగారుపడిపోయే నన్ను చూసి వాళ్ళు చాలా ఆశ్చర్యపోయేవారు.

అన్నీ వున్నాయి. నా చుట్టూ......

పుస్తకాలు, సంగీతం, ప్రకృతి, స్నేహమాధుర్యం. కానీ దేన్ని అనుభవించినా ఆనందముండటం లేదు.

ఒక్క తన సాన్నిధ్యంలోనే సమస్త సుఖసంతోషాలు లభ్యమవుతాయేమో?

ఆ రోజు- కిరణ్మయి నా కోసం యింటికి వచ్చింది. ఎవ్వరూ లేని సమయం చూసి నా చేతిలో లెటరు పెట్టింది.

నాకర్థమయిపోయింది అది ఖచ్చితంగా 'స్వరూప్' వ్రాసిన లెటరేనని.

ఆ విధంగా నా స్నేహితురాలు మా యిద్దరి మధ్య రాయబారి అయ్యింది. కానీ నేనేనాడు 'స్వరూప్'కి లెటరు వ్రాయలేదు.

'స్వరూప్' లెటర్లు చదువుతుంటే ఒక ప్రక్క సంతోషంగా వుండేది. మరో ప్రక్క ఏడ్చేసేదాన్ని.

పిచ్చిమొద్దూ....ఎన్ని ఆశలో! ఎన్నెన్ని కలలో! అవన్నీ చదువుతూ సర్వం మైమరచిపోయేదాన్ని.

'స్వరూప్' మనస్సు నిండా నేనే వున్నాననిపిస్తుంది. అనుకోనిదేమైనా జరిగితే తను తట్టుకోగలడా? తనకేమైనా అయితే నేను సుఖంగా వుండగలనా?

అందుకే నేను మనసు కఠినం చేసుకుని, 'స్వరూప్'కి యిప్పట్నుండే నేను దూరమయ్యాననే నిజాన్ని అలవాటు చేయాలి.

**అదే మా ప్రేమకు ముగింపు క్షణం. 'నాగేంద్ర'తో నా పెళ్ళయ్యింది. ఆయన నన్నెంత ప్రేమగా చూసుకున్నా 'స్వరూప్'ను మాత్రం మరిచిపోలేకపోయాను. అలాగని చెప్పి నేను ఆయనకి ఏనాడూ అసంతృప్తినీ, అసహనాన్ని కలిగించలేదు.**

పాపం, నా సమాధానం కోసం పరితపించి పోయేవాడు.

ఒకసారైతే చాలా సీరియస్‌గా లెటరు వ్రాశాడు. నన్ను మర్చిపోయుంటావ్? లేకపోతే రేపు నీ మొగుడికి ఉత్తరాలు చూపెడతానని భయపడుంటావ్?

స్వరూప్ నా ప్రేమను కించపరటంతో నా మనస్సు గాయపడటంతో పాటు ఒక్కసారిగా బరస్ట్ అయిపోయాను. ఆవేశంగా పెన్ను అందుకుని ఉత్తరం వ్రాశాను.

హలో మిస్టర్ స్వరూప్ గారూ,

నా నేచర్‌ను బాగాఅర్థం చేసుకున్నందుకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదు. మగాడివనిపించావు? మనస్సుని కష్టపెట్టడంలో మంచి నిపుణుడిలా వున్నావే?

నువ్వింత అందంగా ఆలోచిస్తావని తెలియదే! తెలిసుంటే గంటకో లెటరు వ్రాసేదాన్ని. బోలెడు ఫోటోలు యిచ్చేదాన్ని.

ముందు నా మనస్సులో ఎంతో ఉన్నతంగా, పవిత్రంగా వున్న నీ స్థానం ఏమిటో తెలుసుకో?

ఒకరు చేస్తేనే, శాసిస్తేనే తలుచుకుంటూ భజన చేస్తూ కూర్చోరు. అసలు నాలో ఏదో లోపం వుందనిపిస్తుంది. అయినా నన్ను సంతోషపెట్టే హక్కు, బాధ పెట్టే హక్కు నీకు వుంది. నీకు మాత్రమే వుండాలని నా కోరిక. మన స్థితి నీకు తెలియనిది కాదు. పరిస్థితులు బట్టే మనం ప్రవర్తించాలి.

నువ్వు చేసిన అల్లరి, నువ్వాడిగిన చిలిపిమాటలు నాకీ ఒంటరితనంలో తోడుగా వుండి నన్ను ఆనందపరుస్తున్నాయి. అయినా ఏం జరిగినా అంతా మనమంచికే అనుకుందాం. నేను నీకు ఒకవేళ దూరమైనా నీ జీవితం విషాదమవ్వకూడదనే అలా చేశాను.

ఇట్లు

నేనేమవుతానో నీకు తెలుసుకదా

పాపం, ఆ లెటరు చదివి బోల్డు బాధపడిపోయాడు. ''ఏదో నువ్వు లెటరు వ్రాస్తావనే అలా వ్రాశాను. కానీ, యిలా నన్ను అపార్థం చేసుకుంటావనుకోలేదు'' అంటూ వ్రాశాడు.

దానికి రిప్లయ్ యిద్దామనుకుంటున్న సమయంలో మా నాన్నగారు గప్‌చిప్‌గా నాకు పెళ్ళి చూపులు ఏర్పాటు చేయించారు. తాంబూలాలు కూడా హడావిడిగా తీసేసుకున్నారు.

''నేనొక రాయిని. నేనొక పాతకిని. నేనొక నంగనాచిని. ఆడపిల్ల బ్రతుకులే అణచివేత బ్రతుకులు యింకా స్వేచ్ఛ ఎక్కడుంటుంది? ఎవరో ఒకరు సాంప్రదాయం పేర ఏదో విధంగా నోరు కట్టి 'కీ' యిచ్చి ఆడే బొమ్మగా చేస్తారు. నాదీ ఒక బ్రతుకేనా? నాలాంటివారు కలలు కూడా కనకూడదు. ఆశలు పెంచుకోకూడదు.

ఇంక శాశ్వతంగా విడిపోతున్నాం. నువ్వు బాగా చదువుకుని ఉన్నతస్థానంలో వుంటే సంతోషిస్తాను. సలహాలు యిచ్చే అర్హత నాకు లేదనుకో. నేనంటే బాగా అసహ్యమేస్తుంది కదూ. గుడ్‌బై'' అంటూ ఆఖరిసారిగా ఉత్తరం వ్రాశాను.

తర్వాత 'కిరణ్మయి'కి చెప్పేశాను. యిక నుండి తన దగ్గర్నుండి లెటర్లు తీసుకురావద్దని.

మేరేజ్ డేట్ ఫిక్స్ అయిపోయింది.

అకస్మాత్తుగా బస్‌లో కనిపించాడు. అతని ముందు సీటులోనే కూర్చోవాల్సి వచ్చింది.

'స్వరూప్' నన్ను పలకరించాలని ప్రయత్నిస్తే నేను పట్టించుకోనట్లే ప్రవర్తించాను. మనస్సులోని బాధను అణ



చుకుని నటించాను.

మరోసారి నాతో మాట్లాడాలని ప్రయత్నించబోగా విసురుగా లేచి నిలబడ్డాను.

నాకు తెలుసు నా ప్రవర్తనకి 'స్వరూప్' గుండె పూర్తిగా బ్రద్దలయిపోయి వుంటుందని.

అదే మా ప్రేమకు ముగింపు క్షణం. 'నాగేంద్ర'తో నా పెళ్ళయ్యింది. ఆయన నన్నెంత ప్రేమగా చూసుకున్నా 'స్వరూప్'ను మాత్రం మరిచిపోలేకపోయాను. అలాగని చెప్పి నేను ఆయనకి ఏనాడూ అసంతృప్తినీ, అసహనాన్ని కలిగించలేదు.

నా మనస్సులోని బాధను ఏనాడూ ఆయనకు తెలియజేయలేదు. మా పిల్లలు కళ్యాణ్, శ్రీజ.

ఈ ఇరవై ఏళ్ళలో స్వరూప్ ఒక్కసారి కూడా కనిపించలేదు. నేను కూడా తనెక్కడున్నాడా? అని ఎవరినీ ఎందుకో అడగలేకపోయాను.

నాకు తెలుసు అతను మంచి స్థితిలో వుండివుంటాడు. యిప్పటికీ నా మీద పీకల్దాకా కోపం వుండేవుంటుందా?

అలా స్వరూప్ గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

''హేమా...''

ఆయన పిలుపుతో ఉలిక్కిపడి లేచాను.

ఆయనక్కూడా విషయం తెలిసినట్టుంది. మొఖం చాలా సీరియస్‌గా వుంది.

'శ్రీజ, తన క్లాస్‌మేట్‌తో ప్రేమలో పడింది'. వీరి ప్రేమ కథ కాలేజీ అంతా తెలుసు. కానీ మాకీ విషయం చాలా ఆలస్యంగా తెలిసింది.

''శ్రీజను కాలేజీ మానిపించేస్తాను'' ఏదో నిర్ణయానికొచ్చినట్టుగా అన్నారాయన.

నేనేం మాట్లాడలేదు.

ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయి కళ్ళుమూసుకుని పడుకున్నారు.

నేను వెళ్ళి ఆయన ప్రక్కనే కూర్చున్నాను. ఆయన నా వైపు చూశారు.

నేను స్థిరంగా నా ఆలోచన ఆయన ముందు పరిచాను. ఆయన ముఖం ప్రశ్నార్థకంగానే వుంది. కానీ నాకు తెలుసు ఆయన నా మాటకి విలువిస్తారని.

నా మాట మీది గౌరవంతో ఆయన 'శ్రీజ' ప్రేమించినబ్బాయి గురించి వాకబు చేశారు.

వాళ్ళ తల్లిదండ్రులను కలుసుకున్న తర్వాతగాని మా మనస్సులు స్థిమితపడలేదు.

నాకైతే మరీ టెన్షన్.

వాళ్ళు మంచివాళ్ళలా వున్నారు. మా సంబంధాన్ని యిష్టపడుతున్నట్టుగా చెప్పారు.

ఎంతలేదన్నా మరో మూడేళ్ళు పడుతుంది ఆ అబ్బాయి సెటిల్ కావడానికి. అప్పటివరకూ పిల్లలను కంట్రోల్ లో పెట్టుకోవాలి.

ఇంతవరకూ నేనూ, ఆయన శ్రీజ ముందు బైట పడలేదు. తన ప్రేమ సంగతి మాకు తెలియదనే అనుకుంటుంది.

ఓ అందమైన సాయంత్రం-నా ప్రేమకథంతా 'శ్రీజ'కు చెప్పాను.

శ్రీజ ముఖంలో రంగులు మారడం గమనించాను. ''ప్రేమించడం తప్పుకాదమ్మా, కానీ ఆ ప్రేమను నిలబెట్టుకోవడమే గొప్పదనం. ప్రేమ రహస్యంగా వున్నంత కాలం గౌరవం వుంటుంది. అది బైటపడితే ఏం జరుగుతుందో నా అనుభవమే నిదర్శనం. ముందు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడటానికి ప్రయత్నించండి.''

శ్రీ నాకళ్ళల్లోకి ఆనందంగా చూసింది. నా కళ్ళల్లో గ్రీన్ సిగ్నల్, రెడ్ సిగ్నల్ రెండూ కనబడ్డట్టున్నాయి.

★